


ఎవరి ప్రభావానికీ లొంగకుండా, ప్రతిదీ ఆలోచించి, మంచి చెడ్డలు నిర్ణయించుకోగలిగే పిల్లలు కొందరయితే, తల్లి దండ్రుల భయంతో కోరికలను అణుచుకుని గుట్టుగా చదువు పూర్తిచేసే పిల్లలు కొందరు తామేమిటో, తమ కర్తవ్యమేమిటో ఆలోచించకుండా ప్రవర్తించి బాధపడేవాళ్ళు, కేవలం స్నేహితుల ప్రభావానికి లోనయ్యి ముందు వెనుకలు ఆలోచించకుండా బాధపడే వాళ్ళు కొందరు - అటువంటి వాళ్ళల్లో నేనూ ఒకర్తినని చెప్పుకోవచ్చును

మాది ఆడపిల్లల స్కూలు. స్కూలులో చేరగానే నేను క్లాసుకి వెళ్ళి జ్యోతి అనే అమ్మాయి పక్కన కూర్చున్నాను. జ్యోతి క్లాసందరిలో చాలా అందమయిన అమ్మాయి. భయమనేది లేకుండ టీచర్లందరితో ఎంతో ధైర్యంగా మాట్లాడేది. జ్యోతి పక్కన కూర్చున్న వేళా విశేషమేమిటో




కాని, నాలుగయిదు నెలలలోనే ప్రాణ స్నేహితులమయి పోయాము సాయంత్రం స్కూలు అయిపోయాక నేను నడిచి, ఆమె బస్సులోనూ యింటికి వెళ్ళేవాళ్ళం

మా స్కూలు బస్టాండ్‌కి ఫర్లాంగు దూరంలో వుండేది. ఒక రోజు ఒస్టాండ్‌కి వెళ్ళేటప్పుడు యిద్దరబ్బాయిలు తన వెంట పడుతున్నారని చెప్పింది. రోజూ వాళ్ళు అన్న మాటలన్నీ నాతో చెప్పేది విన టానికి నాకూ ఎంతో సరదాగా వుండేది. ఒకనాడు ఆ అబ్బాయిలలో ఒక అబ్బాయి తనకి ఉత్తరం రాశాడనీ చూపించింది. ఆమె అందాన్ని పొగుడుతూ జ్యోతి వివరాలన్నీ తెలుపమని రాశాడు.

వెంటనే జ్యోతి తన పేరు క్లాసూ అన్నీ తెలియజేస్తూ తాను కూడా అతనిని ప్రేమి స్తున్నట్లు రాసింది. సాయంత్రం ఆ వుత్తరం అతనికి అందిచ్చింది క్రమంగా జ్యోతి రోజూ అతని దగ్గరనుంచీ ఉత్త రాలూ, చిన్న చిన్న బహుమతులు అందు కోవడం మొదలు పెట్టింది.

అందరూ జ్యోతి చేసేది గొప్పపని అయి నట్లు ఆమెకి సలహాలు యిస్తుంటే నేను కూడా ఆమె ప్రభావానికి లోనయ్యాను. అందుకే మర్నాడు జ్యోతి ఆ అబ్బాయికి ఉత్తరం రాస్తుంటే అతని స్నేహితుడికి నేను ఎంతో యిష్టపడుతున్నట్టుగా రాయ మన్నాను. ఆ మరునాడు జ్యోతికి అతను రెండు ఉత్తరాలు అందిచ్చాడు. రెండో ఉత్తరం నాకు. ఆ అబ్బాయి పేరు ఆనంద్ అనీ తను కూడా నన్ను ప్రేమి స్తున్నాననీ రాశాడు. అలా మొదల యింది మా ప్రేమాయణం. క్రమంగా నేనుకూడా రోజూ అతని దగ్గరనుంచి ఉత్త రాలు అందుకోవడం వెంటనే జవాబు రాసి యివ్వడం మొదలుపెట్టాను. జ్యోతి మధ్య మధ్య స్కూలు ఎగ్గొట్టి ఆ అబ్బాయితో సినిమాలు షికార్లు మొదలుపెట్టింది.

నేను రోడ్డుమీద ఎవరితోనో మాట్లాడు తున్నట్టు మా అన్నయ్య ఒక రోజు స్వయంగా చూశాడు.

ఒక రోజు జ్యోతి స్కూలుకి రాలేదు.

'పాప'

# ద్వంద్వాలు

కళ్ళు గట్టిగా మూసుకో
మూసుకొని చూడు!
నీకు ఓ భూగోళం అగుపడుతుంది
వెన్నలాటి అంగాలకు
ఇంద్ర ధనుస్సుల చుట్టుకొని
కళ్ళు తెరూ,
సూర్యోదయానికి ఆకాశం
ఒళ్ళు విరుచుకొన్నట్టు
అపుడు చూడు
దృశ్యాల్ని కళ్ళ అంచుల్లోకి
చొప్పించి
నీకు రెండు భూగోళాలు
అగుపడతవి
ఒకటి
సంపెంగల పహరాలో
సరిగమల్ని మేస్తూ—
మరోటి
మంటలై లేచిన మట్టి పిడికిళ్ళమధ్య
మార్మోగే సవాళ్ళు విసురుతూ—

నమ్మి

ఆ సాయంత్రం మా యింటికి వచ్చింది. తనూ ఆ అబ్బాయీ సినిమా చూస్తుండగా వాళ్ళ నాన్నగారు చూశారనీ, యింక అతను యిల్లు విడిచి బయటకి అడుగుపెట్ట డానికి వీల్లేదన్నారని చెప్పింది. అంతే. జ్యోతి నాకు మళ్ళీ కనిపించలేదు. కొన్ని రోజులకి ఆమెకి వాళ్ళ బావతో పెళ్ళయినట్టు తెలిసింది.

ఆరోజే అన్నయ్య నేను రోడ్డుమీద ఎవరితోనో మాట్లాడుతున్నట్టుగా అమ్మతో చెప్పాడు. ఆ రోజు రాత్రి అమ్మ అందరూ పడుకున్నాక నన్ను పైకి పిల్చి అన్నయ్య అన్న మాటలకి, నా సమాధాన మేమిటి అంది. తెల్లబోయిన నేను యిదంతా అబద్ధమనీ, నేను ఏ పాపమూ ఎరగననీ ఒట్టుపెట్టాను. అమ్మ ఆ రోజు మంచి ప్రవర్తన గురించి, నడవడి గురించీ ఎన్నో మంచి మాటలు చెప్పింది. ఆడవాళ్ళ విచ్చలవిడి ప్రవర్తన వల్ల కుటుంబానికి ఎంతో చెడ్డ పేరు వస్తుందో చెప్పింది. ఈ కుటుంబానికి చెడ్డపేరు తెచ్చే పని నీవు చేయవని నేను నమ్ముతున్నాను అని క్రిందకి వెళ్ళిపోయింది. జ్యోతిని ఆదర్శంగా అనుకుని ఉత్తరాలురాసిన నేను ఎటువంటి పరిస్థితులలో చిక్కుకున్నానో తెలుసుకున్నాను. అమ్మ మాటలతో, జ్యోతి నన్ను వదిలి వెళ్ళిపోవడంతో నేనేమిటో నాకు తెలిసి వచ్చింది. నా కర్తవ్యమేమిటో నాకు అర్థమయింది. ఉత్తరాలన్నీ చింపి పారేశాను. యింక ఆనంద్‌కి ఉత్తరాలు రాయకూడదని నిశ్చయించుకున్నాను.

జ్యోతి వెళ్ళిపోయాక క్లాసులో వాతావరణం మారింది. నా ప్రేమ లేఖల వ్యవహారం తెలిసిన పిల్లలంతా ఆనంద్ పేరుతో నన్ను అస్తమానము ఏడిపిస్తూ వుండేవారు. స్కూలు వదిలేసరికి ఆనంద్ అతని స్నేహితుడూ గేటుదగ్గర ప్రత్యక్షమై రకరకాల మాటలతో నన్ను బాధపెడుతూ జవాబు రాయమని వేధిస్తూ బస్‌స్టాండ్ వరకు వచ్చేవారు. వాళ్ళు అందిచ్చిన ఉత్తరాలు తీసుకునే దాన్ని కాదు. కోపంతో వాళ్ళు యిదివరకు రాసిన ఉత్తరాలలోని "డైలాగ్స్" అన్నీ చదువుతూ వెనకాలే వచ్చేవారు.

ఒక నెల రోజులు నిజంగా వాళ్ళతో చాలా బాధ పడ్డాను.

ఒక రోజు నేనూ చెల్లెళ్లు మార్కెట్టుకి వెడుతూండగా వాళ్ళు యిద్దరూ వచ్చి, మొదట ఉత్తరం రాసి హారం

మొకలుపెట్టినదానివి నీవు. యిప్పుడు జవాబెందుకు రాయవని నిలదీశారు. జవాబు రాయకపోతే నేను రాసిన ఉత్తరాలన్నీ నాన్నగారికి అందజేస్తామని బెదిరించారు. చిన్న వాళ్ళయిన చెల్లెళ్ళు నిన్నెందుకు అలా అంటున్నారని అడిగారు వాళ్ళేదో చెప్పి నచ్చచెప్పాను. ఈ సంగతి అమ్మతో అంటారేమో అని భయంతో చచ్చిపోయాను. కాని వాళ్ళు ఈ సంగతి మర్చిపోయారు.

ఆరాత్రి నేను కూర్చుని ఒక సుదీర్ఘమైన ఉత్తరం రాశాను. వాళ్ళిద్దర్నీ అన్నయ్యలూ అంటూ సంబోధించి అన్ని సంగతులూ వివరంగా రాశాను—నా స్నేహితురాలు జ్యోతి గురించి, ఆమెలాగే నాకూ నలుగురిలో గుర్తింపు రావాలన్న కోరికతో కేవలం స్నేహితుల ముందు గొప్ప కోసం ఈ ఉత్తరాలు మొదలు పెట్టానని రాశాను. కాని నిజంగా వాళ్ళతో కలిసి తిరగాలన్న కోరిక నాకు లేదనీ, అసలు ప్రేమ గురించి నాకు ఏ విధమైన అభిప్రాయం లేదనీ రాశాను. కేవలం సరదాకి రాసిన ఆ ఉత్తరాలకి నన్ను క్షమించి నా జోలికి రావద్దని వేడుకున్నాను. నా తప్పుకి అపరాధంగా వాళ్ళకి కావాలిస్తే డబ్బు యిస్తానన్నాను — వాళ్ళు మళ్ళీ నా వెంటపడినా, ఒక్క మాట మాట్లాడినా, ఉత్తరాలు ఎవరికయినా అందజేసినా ఆత్మహత్య చేసుకుని చచ్చిపోతానని బెదిరించాను. మీ చెల్లెలు తెలియక యిలాంటి తప్పుచేస్తే క్షమించరా? అని ప్రశ్నించాను. ఆ మరునాడు ఉత్తరం వాళ్ళకి అందించాను. ఆ రోజు సాయంత్రం స్కూలు దగ్గర వాళ్ళెక్కడ కనిపిస్తారో అని భయపడ్డాను. వాళ్ళు రాలేదు, అంతేకాదు ఆ రోజు నుంచి వాళ్ళు నన్నెపుడూ వేధించలేదు. ఎప్పుడయినా కనబడినా చూడనట్లు వెళ్ళిపోయేవారు.

ఆ సంవత్సరం పదవ క్లాసు ఫేలయ్యాను. అమ్మ నాన్నగారు నన్ను ఏమీ అనలేదు, నా తప్పు నేను తెలుసుకున్నాను.

రెండో సంవత్సరం [illegible] బాగా చదివి పాసయ్యాను. అప్పటినుంచి బి. ఎ. పాస్ అయ్యే వరకు ఏ పరీక్ష తప్పలేదు. ఏ పని చేసినా దాని మంచి చెడ్డలు ఆలోచించి నిర్ణయం తీసుకోవడం అలవాటయ్యింది నాకు. యిప్పటికీ తెలిసీ తెలియని వయస్సులో పిల్లలు ప్రేమను గురించి మాట్లాడితే నవ్వు వస్తుంది నాకు. ✻


## మీరు చదివారా?

రిలీజుకి ముందుగానే 6000 కాపీలు అమ్ముడైన ఆంధ్రుల అభిమాన రచయిత్రి
మాదిరెడ్డి సులోచనగారి డైరెక్టు నవల

**ఎంత ఘాటు ప్రేమయో రు. 12-50**

ముందుగా మీ దగ్గరలోని పుస్తకాల షాపులో కాని, న్యూస్ ఏజంటునుగాని అడగండి.
లేదా రు 10-00 లు M. O. చేయండి పోస్టు ఖర్చులు మేమే భరించి
మిగిలిన రు. 2-50 కి V. P. P. లో పంపుతాము.

డీలక్సు పబ్లికేషన్సు
ఏలూరురోడ్ • విజయవాడ - 520 002